HICON SERIES

CLASS 3 TERM-1

# తెలుగు భారతి

## LESSON 6






CLICK HERE TO ACTIVATE

**LESSON**

PART 1

# 6. ఆంధ్రకేసరి



సాహసం, ధైర్యం, పట్టుదల కలిగిన మహావ్యక్తుల జీవితాలు జాతికి ఎంతో ఉత్సాహజనకంగా ఉంటాయి. అతి సాధారణ కుటుంబంలో జన్మించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన వ్యక్తులలో టంగుటూరి ప్రకాశం పంతులుగారు ఒకరు. ఆయన ఒంగోలు సమీపంలోని వినోదరాయుని పాలెంలో 1872వ సంవత్సరంలో జన్మించారు. ఆయన తల్లి సుబ్బమ్మగారు, తండ్రి గోపాల కృష్ణయ్యగారు.

ప్రకాశం ప్రాథమిక విద్య కొన్నాళ్ళు వల్లూరులోను మరి కొన్నాళ్ళు అద్దంకిలోను జరిగింది. చిన్నప్పటినుండి ప్రకాశం చాలా చురుకైనవాడు. ఆటలలోను, నాటకాలలోను పాల్గొనేవాడు. ప్రకాశానికి పన్నెండు సంవత్సరాల వయస్సులో తండ్రి చనిపోయాడు. అప్పటినుండి కుటుంబ భారం తల్లి సుబ్బమ్మగారి మీదే పడింది. పిల్లల చదువు కోసం ఆవిడ ఒంగోలు వచ్చి పూటకూళ్ళ ఇల్లు నడిపారు. మెట్రిక్యులేషన్ పాసైన వెంటనే ప్రకాశానికి అతని మేనమామ కూతురు హనుమాయమ్మతో వివాహం జరిగినది.

ప్రకాశానికి చిన్నప్పటినుండి ప్లీడరు కావాలనే కోరిక ఉండేది. చదువు మానేసి ఉద్యోగం చూచుకోమని బంధువులు సలహా ఇచ్చారు. కాని ప్రకాశం, హనుమంతరావు మాస్టారు సహాయంతో ఎఫ్.ఏ. లో చేరాడు. తరువాత మద్రాసు వెళ్ళి కష్టపడి చదివి న్యాయవాద విద్య పూర్తి చేశాడు. ఇరవైమూడు సంవత్సరాల వయస్సులో ప్రకాశం రాజమండ్రిలో న్యాయవాదవృత్తిని ప్రారంభించాడు. రాజమండ్రి పురపాలక సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఆ నగర అభివృద్ధికి ఎంతగానో కృషిచేశాడు.

స్వామినాథన్ అనే హైకోర్టు ప్లీడరు ప్రకాశాన్ని ఇంగ్లండు వెళ్ళి బారిష్టరు చదవమని సలహా ఇచ్చారు. పట్టుదల గల ప్రకాశం స్నేహితుల దగ్గర అప్పు చేసిన డబ్బుతో ఇంగ్లండు వెళ్ళి బారిష్టరు చదివాడు. మద్రాసు హైకోర్టులో గ్రేడ్-1 ప్లీడరుగా ప్రాక్టీసు ప్రారంభించాడు. బారిష్టరు సంఘానికి అధ్యక్షుడైనాడు. ఆయన 'లా టైమ్స్' అనే పత్రికను నడిపారు.

ప్రకాశం స్వాతంత్ర్యోద్యమంలో చేరి, న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా వదిలేశారు. స్వయంగా 'స్వరాజ్య' అనే పత్రికను ప్రారంభించారు. ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రేకెత్తించారు. పన్నుల నిరాకరణోద్యమంలో పాల్గొని దానికి నాయకులు అయ్యారు.

ప్రకాశం బ్రిటిషువారి తుపాకీకి రొమ్ముచూపి ఎదురునిల్చారు. ఆయన చేసిన సింహగర్జనకు బ్రిటిష్‌వారు వణికిపోయారు. ప్రజలు ఆయనను 'ఆంధ్రకేసరి' అనే బిరుదుతో సత్కరించారు. ఆంధ్రరాష్ట్రం మొదటి ముఖ్యమంత్రిగా ఎంపికై ఎనలేని సేవ చేసినారు.

పుట్టినప్పుడే ఎవరూ గొప్ప వ్యక్తులుగా జన్మించరు. పట్టుదల కృషి ఉంటే సామాన్యులు కూడా గొప్పవ్యక్తులు అవుతారు. దీనికి ప్రకాశం జీవితమే ఒక చక్కని ఉదాహరణ. ప్రకాశం 1957 సంవత్సరం మే నెల 19వ తేదీన స్వర్గస్థులయ్యారు. గౌరవంతో ఈయన జన్మించిన జిల్లాకు ప్రభుత్వం ప్రకాశం జిల్లా అనే పేరు పెట్టింది.




## I. అర్థాలు :

ఉత్సాహజనకం = సంతోషం కలిగించేది

జన్మించుట = పుట్టుట

చురుకైన = తెలివైన

వివాహం = పెళ్ళి

ప్లీడరు = న్యాయవాది

ప్రారంభించు = మొదలు పెట్టు

అభివృద్ధి = పెంపు

## II. వ్యతిరేకపదాలు :

ధైర్యం × అధైర్యం

సాధారణ × అసాధారణ

జన్మించు × మరణించు

స్నేహితులు × విరోధులు

## III. ఏకవచనం - బహువచనం

వ్యక్తి - వ్యక్తులు

నాటకం - నాటకాలు

ఇల్లు - ఇళ్ళు

వృత్తి - వృత్తులు

సామాన్యుడు - సామాన్యులు

IV. క్రింది వాక్యాలలో తప్పు ( × ) ఒప్పు ( ✓ ) లను బ్రాకెట్లలో ఉంచండి.

1. ప్రకాశం పంతులు గారు 1827 సంవత్సరంలో జన్మించారు ( )
2. ప్రకాశం చాలా చురుకైన వాడు. ( )
3. ప్రకాశానికి హనుమాయమ్మతో వివాహం జరిగింది. ( )
4. ప్రకాశం బిరుదు ఉక్కు మనిషి ( )

V. క్రింది ఖాళీలను పూరించండి.

1. ఆయన తల్లి ________________
2. ________________ సంఘానికి అధ్యక్షుడైనాడు.
3. స్వయంగా ________________ అనే పత్రికను ప్రారంభించారు.
4. ఆంధ్రరాష్ట్రం తొలి ________________ గా ఎంపికైనారు.

VI. సరైన జవాబుకు ముందున్న అక్షరాన్ని బ్రాకెట్టులో వ్రాయండి.

1. ప్రకాశం గారి జన్మస్థలం ( )
   (క) గుంటూరు (గ) చీరాల (చ) వినోదరాయునిపాలెం
2. ప్రకాశానికి ____సం॥ల వయస్సులో తండ్రి చనిపోయాడు ( )
   (క) 15 సంవత్సరాలు (గ) 12 సంవత్సరాలు (చ) 10 సంవత్సరాలు
3. ప్రకాశంగారు ఏ పురపాలక సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు ? ( )
   (క) రాజమండ్రి (గ) తిరుపతి (చ) విజయవాడ

VII. జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. అధ్యక్షుడు | ( ) | (క) | గోపాలకృష్ణయ్య |
| 2. పత్రిక | ( ) | (గ) | హనుమంతరావు |
| 3. తల్లి | ( ) | (చ) | రాజమండ్రి |
| 4. తండ్రి | ( ) | (జ) | లా టైమ్స్ |
| 5. గురువు | ( ) | (ట) | సుబ్బమ్మ |

VIII. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. ప్రకాశం పంతులుగారి తల్లిదండ్రులెవరు?
2. ఆయన ప్రాథమిక విద్య ఎక్కడ జరిగింది ?
3. కుటుంబ భారం ఆయన తల్లి మీద ఎందుకు పడింది ?
4. బారిష్టరు ఎలా పూర్తి చేశారు ?
5. బ్రిటిష్ వారు ఎందుకు వణికిపోయారు ?

ఈ క్రింది పదాలలోని అక్షరాలు తారుమారు అయ్యాయి. వాటిని సరిచేసి రాయండి.

1. అక్షలురా : ______________ 3. ప్రాకథమి : ______________

2. వకిణిపోవు : ______________ 4. పంలుతు : ______________

## వ్యాకరణము

తెలుగువారు మాట్లాడే భాష తెలుగు. దీనిని ఆంధ్రభాష అనికూడా అంటారు. తెలుగు భాషకు అక్షరాలు 56. వాటిలో అచ్చులు 16, హల్లులు 37. ఉభయాక్షరాలు మూడు.

అచ్చులు : 'అ' నుండి 'ఔ' వరకు

హల్లులు : 'క' నుండి 'ఱ' వరకు

ఉభయాక్షరాలు : ం, ఁ, ః